క్లుప్తంగా

ఆత్మరక్షణకు విద్యార్థులు కరాటే నేర్చుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ రవీందర్

రామడుగు: ప్రతి విద్యార్థి ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలని చొప్పదండి సీఐ రవీందర్ అన్నారు. మండలంలోని గోపాల్‌రావుపేట అక్షర పాఠశాల విద్యార్థులు శ్రీమాన్‌తేజ, ప్రణీత, శివచరణ్, వెన్నెల, రిష్యాంత్, పూర్ణచందర్, కార్తీక్, శ్రీవైష్ణవి, లాస్య జిల్లా కేంద్రంలో నిర్వహించిన గోజిరాయి 9వ జాతీయ స్థాయి కుంగు పూ కరాటే పోటీల్లో వివిధ మెడల్స్‌ను సాధించారు. సోమవారం విద్యార్థులను సర్కిల్ కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మినుకుల మునీందర్, మాస్టర్ రాజు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండకు చెందిన పలువురు సోమవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సేవాదళ్ నాయకులు మ్యాకల రామక్రిష్ణ, ఏవైఎస్ మాజీ అధ్యక్షుడు దుర్గయ్య, హరీశ్, కుమార్, అనిల్, శ్యామ్, తదితరులు పార్టీలో చేరగాఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రోడ్డు కబ్జా చేసే వారిపై చర్యలు తీసుకోవాలి



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాలనీవాసులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని హరితనగర్‌లో 18 ఏళ్లుగా వినియోగంలో ఉన్న రోడ్డును రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాకు పాల్పడుతున్నారని కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు సోమవారం ఫిర్యాదు చేశారు. గతంలో కొందరు కబ్జాకు యత్నించినప్పటికి మున్సిపల్ చైర్మన్, అధికారులకు కాలనీ వాసులు ఫిర్యాదు చేశామని మళ్లీ కబ్జా చేస్తున్నారని అడ్డుకుంటే భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కబ్జా చేసే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని చందు, కళాధర్‌రావు కాలనీ వాసులు కోరారు.

హామీలు నెరవేర్చాలి

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఓసీలను విస్మరించిందని ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు ఆరోపించారు. సోమవారం పట్టణంలో మాట్లాడారు. బడ్జెట్‌లో సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీల మేరకు ఓసీ కార్పొరేషన్ ఏర్పాటుకు నిధులు కేటాయించలేదని, హుజూరాబాద్ ఉపఎన్నికల సమయంలో వాగ్దానాల ప్రకారం రెడ్డి, వైశ్య కులాల్లోని పేదల సంక్షేమం కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ఓసీలపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరికాదని, ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

ఇంటింటి ప్రచారం



ఇల్లందకుంట: రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్రకు అనుసంధానంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాథ్‌సే హాథ్ జోడో యాత్రను సోమవారం ప్రారంభించగా ఇల్లందకుంట మండల కేంద్రంలో పార్టీ నాయకులు కార్యక్రమంపై ఇంటింటి ప్రచారం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, ఓదెలు, తిరుపతిరెడ్డి, ఐలయ్య, కిషన్‌రెడ్డి, సింగిరెడ్డి గోపాల్‌రెడ్డి, సాయిరామ్, యూత్‌కాంగ్రెస్ నాయకులు శివ, శ్రీకాంత్, సాయి, శ్యామ్, సందీప్‌రెడ్డి, వెంకటేష్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

మున్నాళ్ల ముచ్చటే..!

- శిథిలావస్థలో స్త్రీ శక్తి, ఉపాధి హామీ భవనం
- కుంగుతున్న ఫ్లోరింగ్, పాములు, తేళ్లకు ఆవాసం
- కనీస వసతులు లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



భవనంలోపల కుంగిన ఫ్లోరింగ్

వసతులు పూర్తిగా లేకున్నా.. ఎట్టకేలకు సొంత భవనంలోకి వెళ్లామని ఆ రెండు విభాగాల సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. కానీ ఆ సంతోషం కలగానే మిగిలింది. భవనం గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఫ్లోరింగ్ దస్కి నెర్రెలు బారింది. ఒక్క గది సరిగా లేకపోవడంతోపాటు నెర్రెల నుంచి పాములు, తేళ్లు వస్తున్నాయి.



స్త్రీ శక్తి, ఉపాధి హామీ భవనం

సైదాపూర్: ఐకేపీ, ఉపాధి హామీ విభాగాలకు కలిపి ప్రత్యేక భవనం కోసం గత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.32 లక్షలు నిధులు మంజూరు చేసింది. 2011 నవంబర్ 27న అప్పటి ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి వెన్కెపల్లిలో మండల కాంప్లెక్స్‌లో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయగా ఐదేళ్ల నిర్మాణం పూర్తయింది. 2016 నవంబర్ 26న మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌తో కలిసి భవనాన్ని ప్రారంభించారు. ఉపాధి హామీతో పాటు ఐకేపీ కార్యాలయాలకు నీటి సరఫరా లేదు.

- ఐకేపీలో 26 గ్రామ పంచాయతీల్లో 35 గ్రామైఖ్య సంఘాలు, మొత్తం 9 వేల మంది మహిళలు స్వశక్తి సంఘాల సభ్యులుగా ఉన్నారు.
- ప్రతినెల కార్యాలయంలో సంఘాల ఆర్థిక లావాదేవీలపై సమావేశాలు నిర్వహిస్తారు.
- అందరు మహిళలే కావడం, మరుగుదొడ్డి నిర్మించినా వాటర్ సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారు.
- సెప్టిక్ ట్యాంక్ పైకప్పు వేయకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో నిరుపయోగంగా మారాయి.
- స్వచ్ఛభారత్‌లో ఇంటికో మరుగుదొడ్డి కట్టుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా మహిళా సంఘం భవనంలోనే మరుగుదొడ్డి లేకపోవడంపై మహిళలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.
- ఆరు నెలల క్రితం ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి శిథిలమైన భవనాన్ని పరిశీలించారు. మరమ్మతు చేయిస్తానని హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదు. చివరకు సంఘాల నుంచి డబ్బులతో మరమ్మతు చేయించుకోవాలని సూచిస్తున్నారని ఐకేపీ సిబ్బంది వాపోతున్నారు.
- జిల్లా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి మరమ్మతులతోపాటు బోర్‌బావి వేయాలని స్వశక్తి మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు. 4

భయంతో పని చేస్తున్నా



ఫ్లోర్ కుంగడంతో రోజూ ఊడ్చే సమయంలో బండల కింది నుంచి పాములు, తేళ్లు వస్తున్నాయి. భయంతో పని చేస్తున్నాను. మీటింగ్‌కు వచ్చే మహిళా సంఘాల సభ్యులు జంకుతున్నారు. బండలపై నుంచి జారి పడుతున్నారు. ఫ్లోరింగ్ ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి.

– వెంకటేశ్, అటెండర్, ఐకేపీ కార్యాలయం

మరమ్మతులు చేయాలి



భవనానికి నీటిసదుపాయం లేదు. దీంతో మరుగుదొడ్డి నిరుపయోగంగా మారింది. ప్రతినెల సమావేశాలకు వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కార్యాలయంలోని అన్ని గదుల్లో ఫ్లోరింగ్ కుంగి గుంతలు ఏర్పడుతున్నాయి. గోడలు పగుళ్లు బారాయి. మరమ్మతులతోపాటు బోర్‌బావి వేయాలి.

– చెన్నబోయిన కుమారస్వామి, ఏపీఎం ఐకేపీ, సైదాపూర్

నియామకం

గౌరెల పెంపకందార్ల సహకార సంఘం అధ్యక్షుడిగా మహేశ్



మహేశ్, మల్లేశ్

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామంలో గొర్రెల పెంపకందార్ల సహకార సంఘం ఎన్నికలు సోమవారం నిర్వహించారు. సంఘం కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోతరవేని మహేశ్, కార్యదర్శిగా సంధ్యవేణి మల్లేశ్, ఏడుగురు డైరెక్టర్లను ఎన్నుకున్నారు. ఎన్నికైన నవారు మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలను యాదవులకు అందేవిధంగా తమవంతు కృషి చేస్తామన్నారు.

రెడ్డి సంఘం ఎన్నిక

చొప్పదండి: మండలంలోని దేశాయిపేట గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా సింగిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా తీపిరెడ్డి మహిపాల్ రెడ్డి, కార్యదర్శిగా కళ్యాం భూంరెడ్డి, కోశాధికారిగా భేతి నరేందర్ రెడ్డి, ముఖ్య సలహాదారుగా సింగిరెడ్డి అశోక్ రెడ్డి ఎన్నికయ్యారు.

అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడిగా మహేశ్

రామడుగు: తెలంగాణ అంబేడ్కర్ సంఘం రామడుగు మండల శాఖ అధ్యక్షుడిగా మండలంలోని షానగర్ గ్రామానికి చెందిన పర్లపల్లి మహేష్‌ను నియామకమయ్యారు. ఈమేరకు కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చంటి శ్రీనివాస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పరామర్శ

మానకొండూర్: మండలంలోని లలితాపూర్ గ్రామ సర్పంచ్ మర్రి కొండయ్య భార్య వనజ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామక్రిష్ణారావు సోమవారం కొండయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంట జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతి కల్పించాలి



భాషా పండితులు, పీఈటీల నిరసన

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియలో తమకు అవకాశం కల్పించాలని భాషా పండితులు, పీఈటీల జిల్లా, మండల జేఏసీ నాయకులు నెరుపట్ల చైతన్య కృష్ణ, మంగళపల్లి సంపత్‌లు డిమాండ్ చేశారు. సోమవారం భోజన విరామ సమయంలో పట్టణంలోని ఎంఆర్సీ భవనం, గాంధీ చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేసి గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 ఏళ్లుగా భాషా పండితులు, పీఈటీలు పదోన్నతి లేకుండా పదవి విరమణ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాపాటి మల్లయ్య, కటంగూరి కరుణాకర్‌రెడ్డి, బాషబోయిన ఐలయ్య, చిరుత శ్రీనివాస్, మర్రి అవినాశ్, ఇస్లావత్ సునీత, నజీమా,రేష్మ, జగ్మాల్ , శ్రీనివాస్, రేణుక, సుజాత, శేఖర్, అశోక్, శోభ, కౌసల్య,కాళీదాస్, వసంతనాయక్, సుజాత పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు అర్హులను గుర్తించాలి



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

చొప్పదండి: పట్టణంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు అర్హులైనవారిని గుర్తించాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పాలకవర్గ సభ్యులు, అధికారులకు సూచించారు. ఈ మేరకు ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, అధికారులు, కౌన్సిలర్లతో తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని కోరారు. పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంబటి రజిత, ఆర్‌ఐ అరుణ్‌కుమార్, శ్రీనివాస్, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత



జమ్మికుంట: మండలంలోని మాచనపల్లి గ్రామంలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి దాతలు సోమవారం విరాళం అందజేశారు. బోలవేల సమ్మయ్య రూ.51,116, పర్లపల్లి సంపత్ రూ.10,116 విరాళం ఇచ్చారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజేశ్వర్‌రావు, కనవేన రాజమల్లు, పర్లపల్లి రమేష్, పర్లపల్లి నాగరాజు, అప్పని రాజు, పోతరాజు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపకాలువ పనులు నిలిపివేయాలని వినతి

గన్నేరువరం: మండలంలోని మిడ్ మానేరు ప్రాజెక్టు కుడికాలువకు అనుసంధానంగా చేపట్టే ఉపకాలువ 10 పనులు నిలిపివేయాలని మాదాపూర్, జంగపల్లి గ్రామాల రైతులు సోమవారం తహసీల్దార్ బాషింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే తోటపల్లి రిజర్వాయర్ బ్యాక్ వాటర్ వల్ల వ్యవసాయ భూములు జాలుతో సాగుకు వీలు లేకుండా పోతున్నాయన్నారు. కాలువ కింద అధికారులు చేపడుతున్న భూసేకరణ పనులు ఆపివేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, ధృవాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, మధుకర్ పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఇచ్చేదెప్పుడో?

సైదాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కటి నెరవేరడంలేదని నిరుద్యోగ భృతి జాడేలేదని డీసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు చాడ కొండాల్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చివరకు దళితబంధు అంటూ ఊరిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వాన్ని దళితులు నమ్మడంలేదన్నారు. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయడంలేదని, ఉపఎన్నికలు ఎక్కడుంటే అక్కడ ఉచిత పథకాలు ఇవ్వడం సరికాదన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

జమ్మికుంట: మండలంలోని వావిలాల గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకుడు గొర్ల రాజమల్లు ఇటీవల మృతి చెందాడు. సోమవారం ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఆదేశాల మేరకు జెడ్పీటీసీ శ్రీరాంశ్యామ్, ఎంపీపీ మమతప్రసాద్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యకర్తలకు పార్టీ, ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి అండగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలతసత్యం, ఎంపీటీసీ మల్లేశం, బీఆర్‌ఎస్ నాయకులు మహేందర్, అర్జున్, సపంత్ పాల్గొన్నారు.

క్రీడలు

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులు ఎ. స్వాతి, వి. మానస, ఏ. కావ్య, ఈ. దివ్య బాలికల విభాగంలో, శ్రీకాంత్, అజయ్, రాకేశ్ బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారని ఇన్‌చార్జి హెచ్‌ఎం పవన్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు లొంకల వెంకటరమణ తెలిపారు. ఈ నెల 7,8వ తేదీల్లో సాయి మానేరు పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ కోల రమేష్, ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రత్నాకర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ కుమార్ అభినందించారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో హుజూరాబాద్ విద్యార్థుల ప్రతిభ



సాధించిన మెడల్స్‌తో కరాటే విద్యార్థులు

హుజూరాబాద్ : వరంగల్ జిల్లా నర్సంపేటలోని పద్మశాలీ భవనంలో ఈ నెల 5న నిర్వహించిన జాతీయస్థాయ కరాటే పోటీల్లో హుజూరాబాద్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు కరాటే రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూసారపు బాపురావు, జిల్లా అధ్యక్షుడు రొంటాల రాణికుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. కరాటే పోటీల్లో హుజూరాబాద్ నుంచి 29 మంది విద్యార్థులు పాల్గొనగా కట్టాస్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి మెడల్స్ సాధించటంతో పాటుఓవరాల్ గ్రాండ్ చాంపియన్ షిప్ సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి గెల్లు శ్రీనివాసయాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, నాయకులు వొడితెల ప్రణవ్ లు అభినందించారు.

తడి, పొడి సాగుతో అధిక దిగుబడి



అవగాహన కల్పిస్తున్న కొండల్‌రెడ్డి



మొక్కలు నాటుతున్న వ్యవసాయాధికారి శ్రీధర్

జమ్మికుంట: తడి, పొడి పద్ధతిలో వరిసాగు చేస్తే అధిక దిగుబడితోపాటు రైతులకు మేలు అని పద్మపాణి స్వచ్ఛంద సంస్థ క్లస్టర్ అధికారి కొండల్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధి ధర్మారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 15 నుంచి 30శాతం నీటి వినియోగం తగ్గుతుందని, వాతావరణ కాలుష్య కారకం మీథేన్ వాయువు విడుదల తగ్గుతుందన్నారు. వేరు వ్యవస్థ అభివృద్ధి చెంది పడిపోకుండా ఉంటుందని, చీడపీడల బెడద ఉండదన్నారు. రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మారం పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు మొగిలి, డైరెక్టర్లు వేణురావు, మాజీ చైర్మన్ రాంప్రసాద్, రైతులు, స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ రామకృష్ణ పాల్గొన్నారు.

అంతర పంటలపై అవగాహన

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్‌లో ఆయిల్‌పామ్ తోటలో అంతరపంటల సాగుపై రైతులకు వ్యవసాయాధికారులు సోమవారం అవగాహన కల్పించారు. టామాట, పచ్చిమిర్చి, బీర, బెండకాయ మొదలగు కూరగాయలను పండించే విధానాన్ని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ వివరించారు. అనంతరం ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. అంతర్గత పంటలతో అధిక లాభాలను ఆర్జించవచ్చన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయాధికారి హరీశ్, రైతులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి



మహేశ్‌ను సన్మానిస్తున్న అధ్యక్షుడు శంకర్

గన్నేరువరం: బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ పాలక్ ఎర్రం మహేశ్ అన్నారు. మండలకేంద్రంలో సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మహేశ్, నియోజకవర్గ ఇన్‌చార్జి నాగరాజు, కన్వీనర్ జగన్‌రెడ్డి, పవన్‌కుమార్ హాజరై మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా గడపగడపకు పార్టీని తీసుకెళ్లాలన్నారు. మండల ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, యువమోర్చాల అధ్యక్షుల, సోషల్ మీడియా కన్వీనర్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

రామడుగు/జమ్మికుంట/గంగాధర/చొప్పదండి: మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వేతనాలు రూ. మూడు వేలకు పెంచడంతో సోమవారం వివిధ మండల కేంద్రాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి మధ్యాహ్న భోజన నిర్వాహకులు క్షీరాభిషేకం చేశారు. బడ్జెట్‌లో దళితబంధు కోసం రూ. 17,700 కోట్లు కేటాయించడంపై చొప్పదండిలో మండల ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

క్వింటాల్ పత్తి ధర రూ.7,700

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం క్వింటాల్ పత్తి ధర రూ.7,700 పలికింది. మార్కెట్‌కు 126 వాహనాల్లో 1,702 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,700, మోడల్ ధర రూ.7,600, కనిష్ట ధర రూ.7,000 చెల్లించారు. గన్నీ సంచుల్లో 30 మంది రైతులు 36 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,400, మోడల్ ధర రూ.7,300, కనిష్ట ధర రూ.6,500 పలికింది. కొనుగోళ్లను మార్కెట్ కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

చిగురుమామిడి: మండల కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో యాత్ర కార్య క్రమం నిర్వహించారు. సోమవారం స్థానిక బస్టాండ్ ఆవరణలో పలువురిని కలిసి కాంగ్రెస్‌పార్టీ పాలనలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి యాత్ర విజయవంతం చేయాలని కోరారు.

అనారోగ్యంతో వాగ్గేయకారుడు మృతి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ కు చెందిన వాగ్గేయకారుడు మొలుగూరి సాంబన్న అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. అతడి మృతిపై ద్రావిడ సాంస్కృతిక కళా మండలి సభ్యులు విచారం వ్యక్తం చేస్తూ సోమవారం ప్రకటనలో సంతాపం తెలిపారు. సాంబన్న మూఢ నమ్మకాల నిర్మూలనకు కృషి చేయటంతో పాటు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.

ఆధ్యాత్మికం

హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపులో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు



నాకబలి నిర్వహిస్తున్న వేదపండితులు



కోనేరులో స్వామివారికి చక్రస్నానం

గన్నేరువరం: మండలంలోని మైలారం శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం ఆలయ చైర్మన్ వరాల పర్శరాములు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు ఆలయ బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. అనుబంధ శ్రీ రేణుక ఎల్లమ్మ, దుర్గమ్మ, పోచమ్మ ఆలయాల హుండీలను సైతం లెక్కించారు. స్వామివారి ఆర్జిత సేవ, టిక్కెట్ల రూపంలో రూ. 2,05,101 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. జాతర విజయవంతంగా ముగిసిందని సహకరించిన వారందరికి చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మత్స్యగిరీంద్రస్వామివారికి చక్రస్నానం

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామివారికి కోనేరులో సోమవారం వేదపండితులు శేషం మురళీదరాచార్యులు, రామకృష్ణమాచార్యులు చక్రస్నానం చేశారు. తెల్లవారుజామున సుప్రభాతం, నిత్యారాదన, బలిహరణం, నాకబలి, తదితర కార్యక్రమాలు చేశారు. సీఐ జనార్దన్, ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ మల్లరావు, సర్పంచ్ కిషన్‌రావు, ఈవో సుధాకర్, దర్మకర్తలు తిరుపతిరెడ్డి, తిరుపతి, సుగుణాకర్‌రెడ్డి, సునీత,సంపత్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదం అందించాలని వ్యాపారులు బియ్యం అందిస్తే దేవదాయశాఖ అధికారులు పులిహోర ప్యాకెట్లు విక్రస్తున్నారని భక్తులు ఆరోపించారు. పులిహోర, లడ్డుప్రసాదం కోసం వేలం నిర్వహించలేదని, లడ్డుప్రసాదం అందుబాటులో లేకపోవడంతో ఈవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.